ప్రజాశక్తి
మంగళవారం 13 ఫిబ్రవరి 2024
5
పార్వతీపురం మన్యం

విశాఖ రేంజ్ డిఐజిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన విశాల్ గున్నిని విజయనగరం, మన్యం జిల్లాల ఎస్‌పిలు దీపికా పాటిల్, విక్రాంత్ పాటిల్ మర్యాద పూర్వకంగా కలిశారు. రెండు జిల్లాల్లో నేర నియంత్రణకు చేపడుతున్న చర్యలను డిఐజికి ఎస్‌పిలు వివరించారు. -ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

నేటి నుంచి టిడిపి శంఖారావం

- ప్రతి నియోజకవర్గంలోనూ సభలు
- నేడు పాలకొండ, కురుపాంలో..
- యువనేత లోకేష్ రాక
- కేడర్‌ను ఎన్నికలకు సిద్ధం చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి యువనేత, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన శంఖారావం యాత్ర ఉమ్మడి జిల్లాలో మంగళవారం నుంచి సాగనుంది. పార్టీ కేడర్‌ను ఎన్నికలకు సిద్ధం చేయడమే లక్ష్యంగా సాగుతున్న ఈ యాత్రలో భాగంగా అన్ని నియోజకవర్గాల్లోను బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఈ సభల్లో లోకేష్ కీలక ప్రసంగం చేయనున్నారు. స్థానిక అపరిష్కృతంగా ఉన్న దీర్ఘకాలిక సమస్యలు, వైసిపి ఎమ్మెల్యేల వైఫల్యాలు, నెరవేరని హామీలపై ప్రసంగం చేయనున్నట్టు సమాచారం. దీనికి ముందే ఆయా నియోజకవర్గాల్లో పార్టీ ముఖ్యనేతల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారని సమాచారం. లోకేష్‌తోపాటు సంబంధిత పార్లమెంటరీ పార్టీ సమన్వయ కర్త, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, స్థానిక జనసేన నాయకులు కూడా మాట్లాడతారు. సభలో ప్రజలు, లేదా పార్టీ కార్యకర్తల నుంచి వచ్చిన వినతులను కూడా స్వీకరించనున్నారు. ప్రతి సభకు 20వేల నుంచి 25వేలకు తగ్గకుండా జనసమీకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం. ఇందుకోసం ఆటోలు, వ్యాన్లు తదితర ప్రైవేటు వాహనాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో శంఖారావం యాత్రకు సంబంధించి అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు అడారి శ్రావణ్‌కుమార్ సమన్వయం చేస్తున్నారు. ఇటు విజయనగరంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు, పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నట్టు సమాచారం. ప్రతి గ్రామం నుంచీ కేడర్ కదిలే విధంగా ప్రయత్నం చేయాలని పార్టీ ఆదేశించినట్టు సమాచారం. శంఖారావం పేరుతో మొదలైన ఈ యాత్రలో పార్టీ నాయకులు, కేడర్‌లోని అలకలు, అసంతృప్తులు, గ్రూపులను పసిగట్టి, అటువంటి చోట పార్టీ పరంగా జాగ్రత్తలు తీసుకునేందుకు కూడా తెరవెనుక వ్యూహం ఉన్నట్టుగా సమాచారం. లోకేష్ దృష్టిలో పడేందుకు ఆశావహులంతా సభ జరిగిన ప్రాంతాలు, రహదారుల్లో భారీ ఫ్లెక్సీ కటౌట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఇదీ శంఖారావం షెడ్యూల్

13న పార్వతీపురం మన్యం జిల్లాలో మధ్యాహ్నం పాలకొండ, సాయంత్రం కురుపాం నియోజక వర్గాల్లో సభలు జరుగుతాయి. 14న జిల్లా పార్వతీపురం, సాలూరు, విజయనగరం జిల్లా బొబ్బిలి నియోజకవర్గం బాడంగిలో సభలు ఏర్పాటు చేశారు. 15న ఎచ్చెర్ల, రాజాం, చీపురుపల్లి, 16న గజపతినగరం, విజయనగరం, నెల్లిమర్ల, 17న ఎస్.కోట నియోజకవర్గాల్లో శంఖారావం యాత్ర సాగుతుంది.

నేడు పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో సభలు

ఈనెల 13వ తేదీ ఉదయం శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలో సభ జరుగనుంది. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు పాలకొండలోనూ, సాయంత్రం 5గంటలకు కురుపాంలోనూ సభలు జరుగుతాయి. పాలకొండ నుంచి వీరఘట్టం వెళ్లే రోడ్డులో మార్కెట్‌యార్డుకు సమీపంలోని ఖాళీ స్థలంలోనూ, కురుపాం నియోజకవర్గం గరుగుబిల్లి మండలం ఎర్రన్న గుడివద్ద బహిరంగ సభలు జరనున్నాయి. సభా ప్రాంగణాలను ఇప్పటికే ఆయా నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జులు, పార్లమెంటరీ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు పరిశీలించారు. సభా వేదికలు సిద్ధమయ్యాయి. నాయకులంతా జన సమీకరణలో నిమగ్నమయ్యారు.

కురుపాంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

శంఖారావానికి భారీ ఏర్పాట్లు

గుమ్మలక్ష్మీపురం: గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర వద్ద జరగనున్న శంఖారావం బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కురుపాం నియోజకవర్గ ఇన్చార్జి తోయక జగదీశ్వరి సభ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ సభకు ఐదు నుంచి పదివేల మంది వరకు వస్తారని అంచనా వేస్తున్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో శంఖారావం సభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. సభకు వచ్చిన ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, పెదమేరంగి, గరుగుబిల్లి తదితర ప్రాంతాల్లో నారా లోకేష్, వీరేష్ దేవ్, తోయక జగదీశ్వరి ఫోటోలతో భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం సభ ఏర్పాట్లను మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు, పెందుర్తి నియోజకవర్గ పరిశీలకులు దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ దగ్గరుండి చేయించారు.

సీతంపేట : పాలకొండ నియోజకవర్గంలో టిడిపి నాయకులు పడాల భూదేవి సీతంపేటలో గల తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరుగు శంఖారావ సభకు వాలంటీర్లను సమాయాత్తం చేస్తున్నారు. శంఖారావ సభకు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గిరిజనులకు అండగా టిడిపి ఎల్లవేళలా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బి జయలక్ష్మి, మాజీ కో-ఆప్షన్ సభ్యులు మోహన్ రావు, మాజీ ఎంపిపి కుంపి తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 167 వినతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

స్థానిక కలెక్టరేట్ లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 167 అర్జీలు అందాయి. కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఇన్‌ఛార్జి డిఆర్ఒ జి.కేశవ నాయుడుతో కలిసి స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో ప్రజలు పెట్టుకునే అర్జీలు రీ ఓపెన్ కాకుండా అర్జీదారులతో మాట్లాడి వారికి సరైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖ జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు

పార్వతీపురంరూరల్ : సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో దాఖలు చేసిన దరఖాస్తులకు సంబంధిత పోలీసు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి సమస్య పరిష్కరించాలని ఎఎస్‌పి సునీల్ షరోన్ సిబ్బందిని ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఆయన అర్జీలను స్వీకరించి, వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 8 ఫిర్యాదులను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో ఎస్‌బి సిఐ సిహెచ్ లక్ష్మణరావు, డిసిఆర్‌బి సిఐ సిహెచ్.వాసునాయుడు, డిసిఆర్‌బి ఎస్ఐ ఫక్రుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

14న జాబ్ మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 14న పార్వతీపురంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఆర్ వహీదా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీ కృష్ణా ఫార్మసీ తమ సంస్థలో వంద ట్రైనీ ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టిందని ఆమె వివరించారు. ఈనెల 14 ఉదయం 10 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహించన్నామని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు www.ncs.gov.in వెబ్ సైట్ లో జాబ్ సీకర్ లాగ్ ఇన్ లో పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. వేతనం రూ.15 వేలు చెల్లిస్తారని, 2019 నుండి 2023 మధ్య బిఎస్సీ కెమిస్ట్రీ ఉత్తీర్ణులైన పురుష అభ్యర్థులు అర్హులని ఆమె చెప్పారు. హైదరాబాదులో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ 10వ తరగతి నుండి డిగ్రీ వరకు గల ఒరిజినల్స్, జెరాక్స్ కాపీ, ఫోటోలతో స్థానికప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాజరు కావాలని ఆమె కోరారు.

రోడ్డు పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

గిరిజన గ్రామాలకు పక్కా రోడ్లు

ప్రజాశక్తి - పాచిపెంట

గిరిజన గ్రామాలకు పక్కా రహదారులు లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పీడిక రాజన్న దొర తెలిపారు. మండలంలోని వేటగానివలస నుండి తంగ్లాం వరకు గల రహదారి నిర్మాణానికి శంఖుస్థాపన, వేటగానివలస నుంచి శతాబి మీదుగా అరకు రహదారిని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గిరిజన గ్రామాలను బాహ్య ప్రపంచంతో అనుసంధానించేందుకు రహదారుల ఆవశ్యకత ఉందని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో రహదారులు, కమ్యూనికేషన్ వ్యవస్థ ఉండడం వల్ల ప్రజలు ప్రయోజనం పొందుతారని అన్నారు. సిఎంకు గిరిజనుల పట్ల ఎంతో అభిమానం ఉందన్నారు. గిరిజనుల అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమం దిశగా పనిచేస్తూ ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. మారుమూల ప్రాంతాలకు సైతం రహదారి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గిరిజనులు సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ప్రగతి పథంలో నడవాలని పిలుపునిచ్చారు. జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎంవిఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల, మండల వైసిపి అధ్యక్షులు గొట్టాపు ముత్యాల నాయుడు, వైస్ ఎంపిపి ఎం.నారాయణరావు, టిడిపి నాయకులు డి.బాబ్జీ, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి డిఆర్ఒ కేశవనాయుడు

పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేయాలని, అధికారులంతా సమన్వయంతో పనిచేసి పరీక్షలు పూర్తి చేయాలని ఇన్‌ఛార్జి డిఆర్ఒ జి.కేశవనాయుడు తెలిపారు. పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా సోమవారం కలెక్టరు కార్యాలయంలో సంబందిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరీక్షల నిర్వహణలో భాగమైన వివిధ శాఖలు చేపట్టాల్సిన ఏర్పాట్లపై డిఆర్ఒ సమీక్షించారు. పరీక్షల నిర్వహణలో ఆయా శాఖలకు కేటాయించిన పనుల ఏర్పాట్లు పూర్తిచేయాల న్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి పరీక్షలను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు బస్సు సౌకర్యంలేని గ్రామాల నుండి ప్రత్యేక బస్సులు నడపాలని ప్రజా రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. రైల్వే గేట్లు గల గ్రామాల నుంచి విద్యార్థులు ముందుగా బయలుదేరేలా చూడాలని తెలిపారు. పరీక్షలు జరుగు రోజుల్లో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో మంచినీరు ఏర్పాటు చేయాలని తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేయాలని, ఎస్కార్ట్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణ, తనిఖీ చేసేందుకు సిట్టింగు, ఫ్లయింగు స్క్వాడ్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్షల నిర్వహణ అనంతరం జవాబు పత్రాల బండిల్స్ సకాలంలో పంపేందుకు పరీక్షల నిర్వహణ అధికారులకు పోస్టలు సిబ్బంది సహకరించాలని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పరీక్షల ఏర్పాట్ల గూర్చి తెలియజేస్తూ జిల్లాలో 217 పాఠశాలలకు చెందిన 11,198 మంది విద్యార్థులు టెన్త్ పదవతరగతి పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. వీరిలో 10534 మంది విద్యార్థులు రెగ్యులర్ గాను, 664 మంది ప్రైవేటుగా పరీక్షలకు హాజరవుతున్నార న్నారు. జిల్లాలో 66 పరీక్షా కేంద్రాలు, 600 మంది ఇన్విజిలేటర్లు, మూడు ఫ్లయింగ్ స్కాడ్లను నియమిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇన్‌ఛార్జి డిఇఒ ఎంఇఒ రేణుజ్యోతి, డిఎం టివిఎస్‌సుధాకర్, ఆర్‌టిఒ సి.మల్లిఖార్జున రెడ్డి , కలెక్టరేట్ సూపరింటెండెంటు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

భారీ వాహనం ఢీకొని నేలకూలిన అంబేద్కర్ విగ్రహం

ప్రజాశక్తి -భామిని

భామిని ప్రధాన కూడలిలో గల బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని సోమవారం ఉదయం, బత్తిలి వైపుగా వెళ్తున్న భారీ వాహనం ఢీకొనడంతో నేలకూలింది. ఇది గమనించిన స్థానికులు వాహనాన్ని నిలిపివేసి పోలీసులు కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న స్థానిక దళిత సంఘం నాయకులు లోపింటి రాజేష్, బొమ్మాలి సంజీవురావు కూడలి వద్దకు వచ్చి అంబేద్కర్ విగ్రహాన్నిపరిశీలించి, యధావిధిగా కూడలిలో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నేలకూలిన అంబేద్కర్ విగ్రహం

కొమరాడ మండల సమస్యలపై వినతి

పార్వతీపురం : కొమరాడ మండలంలోని ముఖ్య సమస్యలపై కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాంబమూర్తి, హెచ్.రామారావు ఇన్‌ఛార్జి డిఆర్‌ఒకు వినతిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కొమరాడ మండలంలో పూర్ణపాడు-లాబేసు వంతెన విషయంపై కాంట్రాక్టర్‌ను వెంటనే రప్పించి పెండింగ్ పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే టిడిపి హయాంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణం కింద కట్టుకున్న 1313 మంది లబ్ధిదారులకు వెంటనే బిల్లు చెల్లించాలని, గడిచిన మూడు నెలలుగా ఎటువంటి కదలిక కనిపించిని హరి ఏనుగును గుర్తించాలని, ఉలిపిరి బాలికల ఆశ్రమ పాఠశాలకు వెంటనే సిసి రోడ్డు వేయాలని, ఉపాధి పనులు ఒక్క పూటే చేపట్టాలని కోరారు.

మట్టిలో మాణిక్యం

వీరఘట్టం : మండలంలోని కిమ్మి ఎంపియుపి పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న పి.జస్వంత్ ఇటీవల జరిగిన ఇఇఎంటి పరీక్షల్లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు బి.అప్పలనాయుడు సోమవారం తెలిపారు. జస్వంత్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించడంతో ప్రధాన ఉపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

16న గ్రామీణ బంద్

ప్రజాశక్తి - సీతంపేట

దేశవ్యాప్తంగా ఈనెల 16న జరుగు గ్రామీణ భారత్ బంద్‌లో కార్మికులు వ్యవసాయ కూలీలు రైతులు పాల్గొని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జెఎసి ఉమ్మడిగా పిలుపునిచ్చాయి. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, మండలం అధ్యక్ష కార్యదర్శులు ఎస్.సురేష్, ఎం. కాంతారావు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ మతతత్వ విధానాలను అవలంబిస్తుందని మోడీ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలకు వివరించేందుకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యోగుల వద్దకు తీసుకెళ్లి బిజెపి అవలంబిస్తున్న కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ రానున్న ఎన్నికల్లో ఈ విధానాలను వ్యతిరేకించి అన్ని కార్మిక వర్గాలు పోరాటంలోకి వచ్చేందుకు జరుగుతున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.

పాచిపెంట : మండల కేంద్రంలో కార్మిక సంఘాలు రైతు కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16 సమ్మె విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిన్నింటి రమేష్, రైతు సంఘం నాయకులు బోని గౌరునాయుడు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, చింత పోలిరాజు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సూకురు లక్ష్మణరావు ఆధ్వర్యంలో పాచిపెంట ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి విధానాలకు వ్యతిరేకంగా రైతాంగ పోరాట స్ఫూర్తితో దేశవ్యాప్తంగా ప్రజలంతా కదులుతున్నారని, కావున ఈనెల 16న జరుగు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కార్మికులు, ప్రజలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు

పాలకొండ : దేశవ్యాప్తంగా ఈనెల 16న జరుగు గ్రామీణ భారత్ బంద్‌లో కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల జెఎసి ఉమ్మడిగా పిలుపునిచ్చాయి. సిఐటియు పాలకొండ మండల సమన్వయ కమిటీ కార్యదర్శి కాదా రాము, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గేదెల సత్యం, ఎడ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యోగుల వద్దకు తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో ఈ విధానాలను వ్యతిరేకించి, అన్ని కార్మిక వర్గాలను పోరాటంలోకి తీసుకొచ్చేందుకు జరుగుతున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో రైస్ మిల్ కార్మికులు పాల్గొన్నారు.

పార్వతీపురం : ఆటో ప్రచారం చేస్తున్న రైతు సంఘాల నాయకులు

పార్వతీపురంరూరల్: ఈనెల 16న దేశవ్యాప్తంగా జరుగుతున్న గ్రామీణ బంద్ విజయవంతం చేయాలని రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు కోరారు. ఈమేరకు మండలంలోని పలు గ్రామాల్లో ఆటో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మోడీ పాలనలో వ్యవసాయ రంగం నాశనం అవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్ల చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా మోడీ విధానాలు అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై వ్యవసాయ కార్మికులు, రైతులు, రైతు కూలీలు, కార్మికులు ఐక్యం కావాలని ఈనెల 16 జరిగే గ్రామీణ బందలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బంటు దాసు, బుడితి అప్పలనాయుడు, బొత్స నర్సింగరావు, పాలక రంజిత్ కుమార్, పి.సంగం ,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: ఈనెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె - గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం లుంబేసు, గౌడుగూడ గ్రామాల్లో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మండంగి సన్యాసిరావు, బిడ్డిక రమేష్ ఉన్నారు.

బంగాళాఖాతంలోకి వైసిపి : కళా

ప్రజాశక్తి, పాలకొండ

జగన్ ప్రభుత్వం త్వరలో బంగాళాఖాతంలో కలవడం ఖాయమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకట్రావు అన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం సభ మంగళవారం మధ్యాహ్నం 1గంటకు వీరఘట్టం రోడ్డులో జరుగుతుందని, దీన్ని విజయవంతం చేయాలని కోరారు. సోమవారం సభా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కార్యకర్తలను, నాయకులను ఉత్తేజ పరచడానికి, అలాగే ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రోజుకు మూడు చోట్ల సభ నిర్వహిస్తున్నామని, దీనికి విశేష స్పందన లభిస్తున్నదని అన్నారు. సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్ రెడ్డి రూ.లక్షా పదివేల కోట్లుతో మద్యం వ్యాపారం చేసుకున్నారని అన్నారు. అంగనవాడీలు, ఆశా వర్కర్లు నిరసన తెలిపితే ప్రజాస్వామ్యాన్ని కూనీ చేసేలా ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఎన్నికల డ్రామేనన్నారు. విలేకరుల సమావేశంలో అరకు పార్లమెంటరీ ఇంచార్జ్ కె. శ్రావణ్ , నియోజకవర్గ ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కె. అప్పలనాయుడు, మండల, పట్టణం టిడిపి అధ్యక్షుడు గండి రామినాయుడు, గంటా సంతోష్, జనసేన నాయకులు నిమ్మల నిబ్రహిం ఉన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి- సాలూరు

ఈనెల 12న పాచిపెంట మండలం గడివలస గ్రామానికి చెందిన కోరాడ జోగీశ్వరరావు హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు రూరల్ సిఐ బాలకృష్ణ చెప్పారు. సోమవారం సాయంత్రం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోరాడ నర్సింహులు, అప్పారావు, ఉమామహేశ్వరరావును మంచాడవలస జంక్షన్‌లో సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని తెలిపారు. విలేకరుల సమావేశంలో పాచిపెంట ఎస్ఐ నారాయణరావు వున్నారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

తోణాం పాఠశాలను పరిశీలించిన జిసిసి డిఎం

ప్రజాశక్తి - సాలూరు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రత్యేక అధికారి, జిసిసి డిఎం వి.మహేంద్రకుమార్ కోరారు. సోమవారం ఆయన మండలంలోని తోణాం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల చదువుపై ఆరా తీశారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు ఎలా సిద్ధం చేస్తున్నా రని పాఠశాల హెచ్‌ఎం సింహాచలంను అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా చూడాలని సూచించారు. పరీక్షలంటే భయాన్ని పోగొట్టి అధిక శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయన పట్టణంలోని జిసిసి గోడౌన్‌ను తనిఖీ చేశారు. హాస్టళ్లకు సరఫరా చేసే సరుకుల నాణ్యత పరిశీలించారు. స్టాకు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పిఒకు వినతిని అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

హెచ్‌ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పిజిహెచ్‌ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని, ఆదివాసీ బహుభాషా ఉపాధ్యాయులకు మార్చి, ఏప్రిల్‌లో కొనసాగించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు, కార్యదర్శి కె.కృష్ణారావు ఐటిడిఎ పిఒ కల్పనాకుమారికి స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. పిఒ ఆధ్వర్యంలో స్థానిక ఐటిడిఎలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ అనేక ఏళ్ల నుంచి పిజిహెచ్‌ఎంల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దీనివల్ల విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు. అలాగే ఉపాధ్యాయ, ఉద్యోగోన్నతులు లేకుండా రిటైర్ అవుతున్నారని అన్నారు. సవర భాషా వాలంటీర్లను మార్చి, ఏప్రిల్‌లో కొనసాగించేలా చూడాలని, దీనివల్ల విద్యార్థులు డ్రాప్స్ అవుట్స్ తగ్గుతుందని అన్నారు. కావున పై సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పిఒను కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న విజయచంద్ర, జగదీష్, చిరంజీవులు

శంఖారావాన్ని విజయవంతం చేయాలి : బోనెల

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఈనెల 14న పార్వతీపురంలో జరగబోయే నారా లోకేష్ శంఖారావం కార్యక్రమం విజయవంతం చేయాలని నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక బైపాస్ రోడ్డులో గల టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 14న వెంకంపేట శివారు క్రీడా మైదానంలో శంఖారావం పేరుతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బహిరంగ సభ జరుగుతుందని, యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు జరుగుతున్నట్టు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, టిడిపి కుటుంబ సభ్యులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చందక అనిల్ కుమార్, టిడిపి నాయకులు, గొట్టపు వెంకట నాయుడు, మజ్జి వెంకటేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రెంటీస్ జిఒ కాపీలు దగ్ధం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ఎమ్మార్వో వద్ద సోమవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో డీఎస్సీ జీవో కాపీలను దగ్ధం చేశారు. ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా అప్రెంటీస్ విధానం రద్దయిందని, దీన్ని సిఎం జగన్మోహన్ రెడ్డి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి మరలా అప్రెంటిస్ విధానాన్ని అమలులోకి తీసుకురావడాన్ని నిరసిస్తూ జీవో కాపీలను దగ్ధం చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.దుర్గాప్రసాద్, కె.దుర్గారావు, సభ్యులు వి.అన్నాజీరావు, సింహాచలం, టి.వెంకటరమణ, బాల్జీ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రవీణ్‌ను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి యువజన విభాగం జిల్లా కార్యదర్శిగా ప్రవీణ్

ప్రజాశక్తి - సాలూరు

వైసిపి మన్యం జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా గొర్లె ప్రవీణ్ కుమార్‌ను నియమించారు. ఈమేరకు సోమవారం లక్ష్మీ థియేటర్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైసిపి యువజన నేత తాడ్డి యశోదకృష్ణ, పువ్వుల భరత్ శ్రీనివాసరావు, బవిరెడ్డి ప్రసాద్, బి.బాలకృష్ణ, మేకల శంకర్రావు, మాజీ కౌన్సిలర్ తాడ్డి శంకర రావు ప్రవీణ్ కుమార్‌ను దుశ్శాలువాతో సన్మానించారు. పట్టణంలో వైసిపి ని మరింత బలోపేతం చేయడానికి యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గా ప్రవీణ్‌కుమార్‌ను ఖరారు చేసినందుకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డిప్యూటీ సిఎం రాజన్నదొరకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతి పంటలతో ఆరోగ్యం భద్రం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రకృతి వ్యవసాయ పంటలను వినియోగించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని ఎంపిపి కె.దీనమయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ పంటలను ప్రదర్శనా ఉంచి అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే ప్రకృతి వ్యవసాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని కోరారు. ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ పంటలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి రాధిక, వైస్ ఎంపిపి లు, ఎంపిటిసిలు సర్పంచులు, ప్రకృతి వ్యవసాయ కోఆర్డినేటర్ కిమిడి భూషణ ఉన్నారు.

వాహనాల వేలం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక పట్టణ పోలీసు స్టేషన్లో ఆరు ద్విచక్ర వాహనాలు (ఒక స్కూటీ, 05 మోటర్ సైకిల్), కారు వేలం వేస్తున్నామని సిఐ కృష్ణారావు తెలిపారు. ఇష్టం గల వారు పోలీసు స్టేషను వచ్చి వేలంలో పాల్గొని, వాహనానికి నిర్ణయించిన ధరకు తక్కువ కాకుండా నిబంధనల ప్రకారం వేలంలో పాల్గొనాలని కోరారు.

ఆటో, మ్యాక్సీ డ్రైవర్లనుద్దేశించి మాట్లాడుతున్న రవాణాశాఖ ఇన్‌స్పెక్టర్ రమేష్

ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా సీతానగరం జంక్షన్లో సోమవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో ఆటో, మ్యాక్సీ డ్రైవర్లకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ ఇన్స్పెక్టర్ ఎం.రమేష్ కుమార్, జి.సత్యనారాయణ మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, ముందు భాగాన్ని కుర్చుని పెట్టకూడద వారన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పకుండా నాణ్యమైన హెల్మెట్లు ధరించాలని తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆటో, మ్యాక్సీ డ్రైవర్లు పాల్గొన్నారు.

పైడిరాజుకు పతకం అందజేస్తున్న నిర్వాహకులు

మాస్టర్ అథ్లెటిక్స్‌లో మామిడిపల్లి వాసికి వెండి పతకం

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని మామిడిపల్లికి చెందిన కనకల పైడిరాజు హైదరాబాదులోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన 35 ప్లస్ మాస్టర్ అథ్లెటిక్స్ 800 మీటర్ల రన్నింగ్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించింది. ఆమె విజయంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇంకా ఆమె జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని మరిన్ని పతకాలు సాధించి గ్రామానికి ఇంకా మంచి పేరు తేవాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.

ప్రజాప్రతినిధులు ఫుల్... అధికారులు నిల్

- సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు డుమ్మా
- వైద్య ఆరోగ్య, వ్యవసాయ శాఖపై ప్రజాప్రతినిధులు గరం గరం
- మహిళా ప్రజాప్రతినిధుల వారి భర్తలు హాజరు

ప్రజాశక్తి - కురుపాం

సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు వస్తేనే సమావేశంలో ఉండాలని, వారి ద్వితీయ శ్రేణి సిబ్బంది వస్తే వెళ్లిపోవాలని సమావేశానికి రాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపిపి శెట్టి పద్మావతి ఎంపిడిఒకు సూచించారు. సోమవారం స్థానిక ఐకెపి కార్యాలయం వద్ద ఎంపిడిఒ ఎస్.అప్పారావు ఆధ్వర్యంలో ఎంపిపి అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైద్యశాఖ సమీక్షకు పిలవగా, మొండెంఖల్ పిహెచ్‌సి వైద్యాధికారి బదులుగా ఎంఎల్‌హెచ్‌పి రావడంతో ఎంపిపి కలుగజేసుకొని మీ వద్ద ఏం సమాచారం ఉంటుందని ఈ సమావేశానికి వచ్చారని ప్రశ్నించారు. పూర్తి సమాచారం మీ వద్ద లేనప్పుడు సమావేశం నుంచి వెళ్లిపోవాలన్నారు. ఎఒ నాగేశ్వరరావు మాట్లాడే సమయంలో ఎంపిపి కలుగజేసుకొని వ్యవసాయ శాఖకు సంబంధించి కనీస సమాచారం కూడా ప్రజాప్రతినిధులకు ఇవ్వకపోవడం సమంజసం కాదని, పనితీరు మార్చుకోవాలని అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ సేవా పథకం కింద ఆరు నెలలుగా డబ్బులు కట్టినా కానీ ఇంతవరకు పరికరాలు రాలేదని, పరికరాలైన ఇవ్వాలి లేదా డబ్బులు అయినా తిరిగి ఇవ్వాలని గుజ్జువాయి సర్పంచ్ హెచ్.నాగేశ్వరరావు ప్రశ్నించగా, ఉన్నతాధికారులతో మాట్లాడి పూర్తి సమాచారం ఇస్తానని అన్నారు. కురుపాం ఎంపిటిసి వి.బంగారు నాయుడు మాట్లాడుతూ స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల భవనం నిర్మించి చాలా రోజులు గడుస్తున్నా ఇంతవరకు బిల్లు కాలేదని అధికారులకు తెలియజేసినా త్వరగా బిల్లు అయ్యేటట్లు చూడాలని ఎంఇఒ ఎన్.సత్యనారాయణ కోరారు. మిగతా శాఖల వారు చేసినవి, భవిష్యత్తు కార్యక్రమాలపై ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించారు. మహిళా ప్రజా ప్రతినిధులకు బదులుగా వారి భర్తలు అధికారులను ప్రశ్నించినా మండల ప్రజా ప్రతినిధులు చూసీ చూడనట్లు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి పద్మావతి

వ్యవహరించడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ, వ్యవసాయ, విద్యా, పశు వైద్య శాఖలు, ఆర్‌డబ్ల్యుఎస్, వైకెపి, ఐసిడిఎస్, హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖ మండలాల అధికారులు తప్ప మిగతా శాఖ అధికారులెవరూ సమావేశానికి హాజరు కాలేదు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, వైస్ ఎంపిపిలు అన్నాజీరావు, రంగారావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, మండలంలో గల పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దీనమయ్య

జీడి కనీస మద్దతు ధర రూ.200కు పెంచాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జీడి కనీస మద్దతు ధర కేజీ రూ.200కు పెంచి గిరిజనుల నుంచి జిసిసి నేరుగా కొనుగోలు చేయాలని చెముడుగూడ ఎంపిటిసి మండంగి రమణ అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపిపి కె.దీనమయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రతి ఏటా గిరిజనుల ప్రధాన జీవనాధారమైన జీడి పంటకు కనీస మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. నాలుగేళ్లుగా కారు మబ్బులు వల్ల పంట దిగుబడి పూర్తిగా తగ్గుతూ వస్తుందన్నారు. చేతికి వచ్చిన కొద్ది పంటనైనా ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఈ ఏడాది చింతపండు కేజీ రూ.60, పసుపు కేజీ రూ.150, కొండ చీపుర్లు రూ.120 కు కొనుగోలు చేయాలని కోరారు. గుమ్మలక్ష్మీపురంలో రక్త నిధి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రమణ డిమాండ్ చేశారు. స్పందించిన వైద్యులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్అండ్ బి, విద్య, వైద్య, గృహ నిర్మాణం, ఐసిడిఎస్ తదితర శాఖలపై చర్చ జరిగింది. సభ దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని ఎంపిపి అధికారులను కోరారు. అలాగే తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించి మండల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో జడ్పిటిసి రాధిక, వైస్ ఎంపిపిలు నిమ్మక శేఖర్, ఎం.లక్ష్మణరావు, బిసి రజక కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబాబు, ఎంపిడిఒ జగదీష్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ రాజేంద్ర, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు సమయాన్ని పెంచాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పాలకొండ, వీరఘట్టం మండలాల్లో ఉన్న ధాన్యాన్ని స్థానిక మిల్లులకే అవకాశం ఇవ్వాలని, లేకుంటే పెరిగిన దూరానికి అయ్యే రవాణా ఛార్జీలకు బాధ్యత ఎవరు వహిస్తారో స్పష్టం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోజరిగిన స్పందనలో జాయింట్ కలెక్టర్ గోవిందరావుకు వినతి అందించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణ సమయం ఈనెల 14తో ముగిస్తుందన్న సమాచారం తెలుసుకున్న రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ మండలాల్లో అపరాల పంట మధ్య వరి కుప్పలు ఉన్నాయని, వాటిని నూర్చడానికి మినప, పెసర పంటలు ఆటంకంగా ఉన్నాయని తెలిపారు. కావున మార్చి మొదటి వారం వరకు ధాన్యం సేకరణ గడువును పెంచాలని కోరారు.

రక్తహీనత నివారణకు చర్యలు : డిఎంఒ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రక్తహీనతను నివారించే దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. ఉద్దవోలులో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ వైద్య సేవలు, రికార్డులు పరిశీలించి వారి ఆరోగ్య సమస్యలు, అందజేసిన చికిత్సను తెలుసుకున్నారు. కొత్తగా గుర్తించిన దీర్ఘకాలిక రోగులను పర్యవేక్షించాలని అన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా ఎక్కువగా రక్తహీనతపై దృష్టి సారించాలని గర్భిణీలకు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికల్లో హీమోగ్లోబిన్ శాతం తక్కువగా గుర్తించిన వారికి నిర్దేశించిన చికిత్స అందజేస్తూ రక్తశాతం వృద్ధి చెందే వరకు పర్యవేక్షించాలని సూచించారు. అలాగే అవసరమైన వారికి సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు జరపాలన్నారు. 104 వాహనంలో మందులు,వైద్య పరికరాలు తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో మంచానికి పరిమితమైన వృద్ధురాలి గృహ సందర్శన చేసి ఆరోగ్య పరిశీలన చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కెకె.సాగర్ వర్మ, హెల్త్ సూపర్ వైజర్ ఉదయ కుమారి, వైద్య సిబ్బంది మౌనిక, ఈశ్వరి, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, రవి, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

రక్తహీనత పరీక్షలు పరిశీలిస్తున్న డిఎంఒ జగన్మోహనరావు

కమిషనర్, తహశీల్దారు సంతకాలపై దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఇటీవల బదిలీపై వెళ్లిన స్థానిక మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు, తహశీల్దార్ శివన్నారాయణ చేసిన సంతకాలపై దర్యాప్తు చేయాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జెసికి వినతిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల బదిలీపై వెళ్లిన మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్ చేసిన సంతకాలపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. మున్సిపల్ కమిషనర్ వెళ్తూ సుమారు 20మందికి నిబంధనలకు విరుద్ధంగా ఆప్కాస్‌లో ఉద్యోగాలు వేసి వెళ్లినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆ ఉద్యోగాల నియామకంలో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారినట్లు చర్చ జరుగుతోందని ఆరోపించారు. అలాగే మిచాంగు తుఫానుకు సంబంధించి ఆర్థిక లావాదేవీల్లో కూడా అవకతవకలకు పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాగే తహశీల్దార్ కూడా బదిలీపై వెళ్లే సమయంలో ఇళ్ల పట్టాలపై అధికంగా సంతకాలు చేసి పలువురికి పట్టాలు ధారదత్తం చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆ పట్టాలు పార్వతీపురం మున్సిపాలిటీలో విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నట్లు తెలి సిందన్నారు. జగనన్న కాలనీల్లో ప్రభుత్వ పాఠశా లకు, అంగన్వాడీలకు, గుడులకు కేటాయించిన స్థలాలకు సైతం పట్టాలు మంజూరు చేసినట్లు తమకు తెలిసిందన్నారు. అలాగే చెరువుల్లోనూ, ప్రభుత్వ స్థలాల్లోనూ తన ఇష్టారాజ్యంగా పట్టాలి చ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నా యన్నారు. తహశీల్దార్ సంతకాలు చేసిన భూమార్పిడి రికార్డులపై క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి దర్యాప్తు చేయాలన్నారు. తహశీల్దార్ పార్వతీ పురంలో విధుల్లో చేరినప్పటి నుండి బదిలీ అయ్యేంత వరకు ఆయన చేసిన ప్రతి సంతకంపై దర్యాప్తు నిర్వహించాలని కోరారు. దీనికి స్పందించిన జాయింట్ కలెక్టర్ వీటిపై దర్యాప్తునకు ఆదేశిస్తామని హామీ ఇచ్చారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

బలిజిపేట మండలం, వెంగాపురానికి చెందిన మరడాన యళ్ళంనాయుడు, రేష్మ దంపతుల కుమారుడుకి అనారోగ్య కారణంగా వైద్యం చేయించి, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న సంగతి తెలుసుకొని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సిఎం సహాయనిధికి సిఫార్సు చేయగా, వారి కుటుంబానికి మంజూరైన రూ.70వేలు విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గులిపిల్లి మురళీ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు పట్టాలు అందజేత

మండలంలోని అడారు గిరిజన గ్రామానికి చెందిన గిరిజన కుటుంబాలు గత కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూమిపై రైతులకు హక్కును కల్పిస్తూ రెవిన్యూ శాఖ మంజూరు చేసిన వ్యవసాయ భూమి మంజూరు పత్రాలను సోమవారం ఎమ్మెల్యే జోగారావు గిరిజనులకు అందజేశారు.

వైసిపిలోకి చేరిన టిడిపి కార్యకర్తలు

మండలంలోని జమదాలకు చెందిన టిడిపి కార్యకర్తలు, మూడో వార్డు సభ్యులు జాగాన పారి నాయుడు, మాచెర్ల కుమారస్వామి, మరిపి అప్పల నాయుడు, బొంగు నరహరి, కార్యకర్తలతో గ్రామ యువత పెద్ద ఎత్తున సోమవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో వైసిపి చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా వేశారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు బొమ్మి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు భీమవరపు కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.గురురాజు, సర్పంచ్ యాళ్ళ ఈశ్వర ప్రతాప్, జెఎఎస్ కన్వీనర్ బంకపల్లి వాసుదేవరావు, వైసిపి నాయకులు భూపతి శేఖర్, యాళ్ల శ్రీను, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

నెలాఖరికి మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న గోతులను నెలాఖరు నాటికి మరమ్మతులు చేపట్టకపోతే తామే బాగు చేసుకుంటామని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి తెలిపారు. సోమవారం కొమరాడలో గల అంతర్ రాష్ట్ర రహదారిపై సిపిఎం, వివిధ పార్టీల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాంమూర్తి మాట్లాడుతూ గడిచిన ఐదు నెలలుగా పార్వతీపురం నుండి కూనేరు మీదుగా మూడు రాష్ట్రాలకు వెళ్లే అంతరాష్ట్ర రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి అటు వాహనదారులు ఇట్టి ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికే అనేకమంది ప్రమాదాలకు గురయ్యారన్నారు. ఇలా గోతుల వద్ద అటు వాహనదారులు ఇటు ప్రయాణికులు ఇబ్బంది పడుతుంటే ఇదే రహదారిపై ప్రయాణించే స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఈ గోతుల విషయం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఈ రహదారిపై ఉన్న పెద్దపెద్ద గోతులను కప్పి అటు వాహన దారులు, ఇటు ప్రయాణికుల ప్రాణాలు కాపాడాలని కోరారు. ఈనెల 28లోగా ఈ సమస్యను పరిష్కరించకపోతే తామే స్వయంగా ఈ గోతులను పూడ్చివేచి ప్రయాణికుల, వాహనదారుల ప్రాణాలను కాపాడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఎ.ఉపేంద్ర అరుకు పార్లమెంటు తెలుగు రైతు అధ్యక్షులు బత్తిలి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు, గిరిజన నాయకులు రామస్వామి పాల్గొన్నారు..

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

ఉపాధి కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధిహామీ పనులు కల్పించాలని వెలగవలస పంచాయతీ పరిధిలోని గ్రామాల గిరిజనులు కలెక్టరేట్ వద్ద గిరిజన, వ్యవసాయ కార్మికసంఘాల ఆధ్వర్యాన సోమవారం ధర్నా చేశారు. తొలుత స్థానిక సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ చేసి, అనంతరం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలోని కొత్త పంచాయితీ వెలగవలస పరిధిలో గల పిండిలోవ, బిలగుడ్డి వలస, దోనిగుడివలస, సంగివలస గిరిజన గ్రామాల్లో రెండేళ్ల నుంచి ఉపాధి పనులు ఇవ్వలేదన్నారు. ములగ పంచాయతీలో ఉన్న వెలగవలస పంచాయతీని వేరు చేయడం వల్ల ఆన్లైన్లో పంచాయతీ చూపించడంలేదని, ఆన్లైన్లో లేని గ్రామాలకు ఉపాధి హామీ పనులు చేపట్టలేమని సిబ్బంది చెబుతున్నారని అన్నారు. ఇప్పటికే పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లోని గ్రామస్తులంతా పనుల్లేక వలస బారిన పడుతున్నారని, ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని వెలగవలస పంచాయతీలో ప్రజలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తడంగి కృష్టయ్య, ఆర్.సాంబయ్య, రాము, వేతనదారులు పాల్గొన్నారు. వీరి ఆందోళనకు సిపిఎం మద్దతు తెలిపింది.

హెచ్‌సిని సన్మానిస్తున్న శాంతినికేతన్ డైరెక్టర్

సేవలకు సన్మానం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో వృద్ధ మిత్ర కోఆర్డినేటర్, హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కె.కృష్ణమూర్తి చేస్తున్న సేవలకు గుర్తించి పట్టణంలోని కొత్తవలసలో గల శాంతినికేతన్ 9వ వార్షికోత్సవంలో పాఠశాల డైరెక్టర్ పల్లెం రవికుమాం, ప్రిన్సిపల్ పల్లెం ఉషారాణి ఆయనకు దుస్సాలువతో సత్కరించి పుష్పగుచ్చాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెలా తన జీతంలో కొంత నిధులను హెచ్చించి వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు, విద్యార్థులకు అన్ని రకాలుగా సహాయం అందిస్తున్నారని పోలీస్ శాఖలో ఆయన సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ పక్కీ మధుసూదనరావు, టీచర్లు, పెద్దలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సలకు వృద్ధుల తరలింపు

ప్రజాశక్తి - కురుపాం

జగనన్న ఆరోగ్య సురక్ష కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నేత్ర పరీక్షలు నిర్వహించిన వారిలో కేటరాక్ట్ (అంతర కుసుమం), టేరిజియం(కొయ్యకండ) లోపం ఉన్న వారిని గుర్తించి, వారికి ఉచితంగా శస్త్ర చికిత్సల కోసం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి ఎన్‌ఆర్‌ఐ (తగరపువలస) కంటి ఆసుపత్రికి సోమవారం తరలించినట్లు జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరందరికీ నేత్రచికిత్సలు చేసి ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్లజోళ్లు, మందులు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు మాలిక, రోజా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఐను అభినందిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ అప్పలనాయుడు

సారా నియంత్రణలో సిఐ కృషి అభినందనీయం

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ పరిధిలో నాటుసారా నియంత్రణలో పట్టణ సిఐ జిడి బాబు చేస్తున్న కృషి అభినందనీయమని మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, పట్టణ వైసిపి యువజన అధ్యక్షులు బవిరెడ్డి ప్రసాద్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ పువ్వుల శ్రీనివాస్ భరత్, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గొర్లి ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం టౌన్ పోలీస్ స్టేషన్ లో సిఐ బాబును దుశ్శాలువాతో వారు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంతకాలంగా పట్టణంలో విచ్చలవిడిగా నాటుసారా విక్రయాలు జరిగాయని, దీనివల్ల ఎన్నో కుటుంబాలు నష్టపోయాయని చెప్పారు. గతంలో పని చేసిన పోలీసు అధికారులెవరూ చేయలేని పనిని జిడి బాబు సాధించారని కొనియాడారు. నాటుసారా అమ్మకాలు, వినియోగం వల్ల కలిగే నష్టాలు, కేసుల గురించి అవగాహన కల్పిస్తూ వారిలో పరివర్తన తీసుకొచ్చారని చెప్పారు. నాటుసారా నియంత్రణకు ఆయన చేపడుతున్న చర్యలు కారణంగా ఆ వృత్తిపై ఆధారపడిన వారు ఇప్పుడు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల వైపు వెళ్తున్నారని అన్నారు. సిఐ జిడి బాబును నియమించిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు, సిఫార్సు చేసిన డిప్యూటీ సిఎం రాజన్నదొరకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తాడ్డి యశోదకృష్ణ, బి.బాలకృష్ణ, మేకల శంకరరావు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోనిబళ్ల కృష్ణాపురం, చినబోగిలి, కాశీపేట, నిడగల్లు పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువల్లో మురుగునీరు లేకుండా వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తోటపల్లి దేవస్థానం అభివృద్ధికి వితరణ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి దేవస్థానం అభివృద్ధికి తనవంతు కానుకగా సోమవారం కీర్తిశేషులు డాక్టర్ పివిసి శేషగిరిరావు జ్ఞాపకార్థం ఆయన భార్య రామలక్ష్మి లక్ష రూపాయల చెక్కును ఆలయ మేనేజింగ్ ట్రస్టీ డి.ధనుంజయరావుకు అందజేశారు. ఈ మేరకు ఆమెకు ట్రస్ట్ మేనేజింగ్ కమిటీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ శ్రీరామచంద్రమూర్తి, ట్రస్టీలు సంకా గౌరీశంకరరావు, పట్నాన చిరంజీవి పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా సచివాలయ భవనం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరలో ఏర్పాటుచేసిన సచివాలయ భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఉపాధి హామీ చట్టం ద్వారా రూ.40 లక్షల అంచనా వ్యయంతో సచివాలయ నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం ఉన్న ఇరుకైన భవనంలో సిబ్బంది విధులు నిర్వహించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సచివాలయ భవనాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కంబర సచివాలయం